కథ

# జ్యోతి కాదు.. పరంజ్యోతి



వీరాజీ

పెళ్ళంటే పెళ్ళే మరి!

విడిది యింతా అంతా సందడిగా వుంది.

బాజాలు, భజంత్రీలు, వీటిని చీలుస్తూ పట్టుచీరెల విసవిసలు, ముత్తయిదువుల ముచ్చట్లు, పడుచు పిల్లల దొంగ చూపులు, వాటి వెనకాతల వాళ్ల దుస్తుల సెంటు వాసనలు.

పెళ్లికి పెళ్లికూతురీడు కన్నెపిల్లలేనా వస్తారు? పెళ్లీడు కుర్రాళ్లూ వస్తారు.

ఉదయం లగ్నం.

లగ్గం వేళ సమీపిస్తున్నా యింకా, "కాఫీలో, యిడ్డెనులో మాకం దనేలేదో!" అని హడావుడీ ఫిర్యాదీ ఒక పక్కన జరుగుతూనే వుంది. "సోడాలర్రో! లైమ్ జ్యూలర్రో!" అని పిల్లలకి కడుపునొప్పి లొచ్చిన తల్లుల సొద.

"ఆకులు వక్కలు" అనీ "పసుపేదీ, ఎక్కడా?" అనీ "అయ్యో! ఆ పట్టుచీరెలిలా తెమ్మనండి! అర్రెరే! యింకా చిల్లర తెప్పించనే లేదా? అర్ధలూ, పావలాలూ మార్పించండి!" లాంటి సంరంభనినాదాలు!

బాజాభజంత్రీలు ఎంత వుద్ధృతంగా వుంటేనేం? అవతల మైకులో "పెళ్లి పెళ్లి" పాట దంచేస్తూ వుంటేనేం?

మగపెళ్లివారి తరపున ఆడవాళ్లు, మగాళ్లకు మల్లే వున్నారు ఓహ్! వాళ్లదే రీవి! ఆడపెళ్లి వారి వంక మగాళ్లూ... ప్చ్! ఆడపెళ్లి వారు కదా, పాపం అలాగే వున్నారు మరి.

గోపాలం మగపెళ్లివాడు.

మరి అలాగే కాఫీ రాలేదని గొణుక్కున్నాడు. అతగాడి దుస్తులు నలిగి, జుట్టు రేగింది. అయినా అందంగా వున్నాడు. ఈత చాప మీద రాత్రి తెల్లార్లూ పేకాడిన యీతచాప మీద కూచుని 'కాఫీని' తల్చుకున్నాడు.

ఏ ప్రౌఢా అతగాడి మాట వినలేదు. ఏ పూర్వసువాసినీ, అతగాణ్ని 'అయ్యో నాయ్నా' అనడానికటుకేసి రాలేదు.

ఓ కన్నెపిల్ల చూసింది!

అతగాడి కాఫీ తపస్సును కటాక్షించింది!

మరి ఐదు నిమిషాల్లో గున గునా మరచెంబుతో వచ్చి, చెంబు నిండా కాఫీ, ఆ పక్కనే కంచు గళానూ పడేసింది. ఆ చిన్నది పరికిణీ, వోణీ పట్టువి వేసుగుంది. నాగరం జడకుప్పెలూ పెట్టుకుంది. కాటుకా, బొట్టూ, పచ్చన బంగారం లాంటి మొహంలో కొట్టవచ్చినట్లున్నాయి.

మొగలిపువ్వులా వచ్చింది!

మెరపుతీగలా వెళ్లిపోయింది!!

ఆ పిల్లని చూస్తూ మర చెంబు మీద చెయ్యి వేసేడేమో గోపాలం. "అమ్మా!" అన్నాడు. అతని చూపుడువేలు 'చుర్రున' వూడిపోయింది. మరచెంబు కంచుది, కాఫీ వేడి పొక్కు.

పది గజాల కవతల అంత సందడిలోనూ, అంత కోలాహలంలోనూ, ఆ విద్యుల్లత, వెడుతూ, వెనుదిరిగి యితని అబసంతితనానికి నవ్వేసింది.

మొదటివేలు చప్పరించుకుని, పరవశంగా, ఆనక మరచెంబుడు కాఫీ తాగేశాడు గోపాలం. అది వంట బ్రాహ్మడు కలిపిందే అయితేనేం? మరుగుతూ వుండి వేలు చుర్రికి మూతి పొక్కిపోతేనేం? ఆ చిన్నదానికి తన మీద కలిగిన మక్కువకి, కృతజ్ఞతాచిహ్నంగా ఆ మరచెంబుడు కాఫీ తాగేశాడతను!

ఇంతకీ ఎవరా ముగ్ధ?

అవతల "వాయించండర్రా వాయించండి!" కేకలు, మంత్రాలు, అవీ కంఠతా వచ్చినవాళ్లకే మంత్రాల్లా వుంటాయి, మరి గుక్క తిప్పుకోకుండా పెళ్లైపోతుంది.

గోపాలం లేచివెళ్లాడు చూద్దామని. ఐతేనేం లాభం? లగ్గమంటపం చుట్టూ ఆడకోట కట్టేశారు. ఎక్కడ చూసినా పట్టుచీరెలు పూల కొప్పులు, గంధం మెడలు!

"ఏదీ బాబూ! కాస్త యిసింటా రా. అయినా గోపాయినా, యిదేం వేడుకర్రా? మొగాళ్లిలా ఎగబడతారూ... నీకూ అవుతుందిలే!" అన్నది ఒకావిడ, గోపాలాన్ని చల్లగా చీవాట్లు వేసినట్లు.

ఓ పదేళ్ల పాప, మరో పదేళ్ల పాపడూ ఎడంగా యీతచాప మీద కూర్చొని సోడా మూతలతోనూ, తమలపాకు యీనెలతోనూ, ఆడుకుంటున్నారు.

గోపాలం మగపెళ్లివాడే గాని, యిరువేపుల వాళ్లకి అంత దగ్గరి చుట్టరికం వున్నవాడు కాదు. కాస్త వేలు విడిచిన బాపతు. తన మేనత్త బలవంతం మీద వచ్చినవాడు.

ఆ పిల్లల దగ్గిరగా కూచున్నాడు.

పదేళ్లకే ఆ పాప, పదహారేళ్ల సిగ్గు ప్రదర్శించింది. దబ్బపండు

ఛాయతో, నిగనిగలాడే బుగ్గలు పండిపోగా దొంగచూపు చూసింది.

"ఏయ్ పాపా, నీ పేరేమిటి?" అడగకుండా వుండ లేకపోయాడు గోపాలం.

"శ్యామల" నోట్లో వేలు పెట్టుకుందునా, మానునా అన్నట్లు తటపటాయించి, చివరకు ఆ వేలు ముక్కున వుంచుకుని చెప్పింది.

"మరి నువ్వింత పచ్చగా కర్పూరబొమ్మలా వున్నావు కదా. అదేం పేరు? ఇంచక్కా 'జ్యోతి' అనకూడదూ?"

అతగాడి అలంకారప్రీతి మీదా, పాండిత్యం మీదా ఆ పిల్లకి మోజు కలిగినట్లు లేదు. కాని అతగాణ్ని పూర్తిగా నిరాశపుచ్చడం ఎందుకని "మా అక్కయ్య పేరు జ్యోతి" అన్నది.

"అచ్చా! మీకో అక్కయ్య వుందన్నమాట? ఏదీ మరీ?" కుతూహలం వ్యక్తపరచేడు.

"అయ్యో పాపం! రాదా ఏమిటీ? మా అక్కయ్యా, మా అమ్మా అంతా వొచ్చేమ్!"

"మరి మీ అక్కయ్య తెల్లగా వుంటుందా?" అంటే కళ్లు చక్రాల్లాగా తిప్పుకుంది శ్యామల.

"మా అక్కయ్య పదకొండో క్లాసు చదివింది తెలుసా?" అన్నది. వాళ్లక్కయ్య గురించి చులకనగా మాటలాడేవాడి కదే శిక్ష అనుకుంది.

"అక్కయ్య వీణె వాయిస్తుంది కూడా!" పాపకి సాయంగా పాపడు కూడా చెప్పేడు.

ఆ పిల్లల ముద్దుమాటల వెనుక దాగివున్న అహంకారం గోపాలాన్ని చకితుణ్ని చేసింది, "ఏసీ, మరి ఇప్పుడెక్కడుంది? ఒకసారి పిలుస్తావూ?" అన్నాడు.

శ్యామల వెంటనే 'రాదు' అని అడ్డంగా తలకాయ ఊపేసింది. కాని తమ్ముడు చిట్టిబాబు "ఓ!" అంటూ దుడుగ్గా పరుగెత్తాడు.

గోపాలం గబుక్కున ఉలిక్కిపడ్డాడు. అక్కణ్నుంచి జారుకుందామా అనుకున్నాడు. 'నేరకపోయి వేశానా ప్రశ్న. ఆ యింతా ఆ పిల్ల కదెన్నేళ్లో వుండి మరో ఇద్దరమ్మలక్కల సాయంతో వచ్చి తన బుగ్గలు పొడిచేసునా? హే భగవాన్! ఆనక అత్తయ్య ఆ మిగిలిన భవిష్యం తీసేస్తుంది.'

చిట్టితమ్ముడు సిసింద్రీలా వెతికాడు జ్యోతిని. "అక్కయ్యా! అక్కయ్యా! అల్లాయన నిన్ను రమ్మంటున్నాడే!" అన్నాడు కొంగు పట్టుకుని లాగి, మరీ

"ఎవర్రా, ఎక్కడా?" అంది వాడు లాగిన పైట మీదికి సర్దుకుంటూ, పాంజువాల పట్టీలు తొడుక్కున్న జ్యోతి లాంటి జ్యోతి.

"నువ్వు మరచెంబుతో కాఫీ ఇచ్చేవే, ఆయనేనే!" అంటూనే వాడు, అక్కయ్య చెయ్యి బుచ్చుకుని విడిది హాలు దాకా వచ్చేశాడు.

అంతవరకూ కుతూహలంగానే వచ్చిన ఆ పిల్ల, జ్యోతి, అక్కడ ఠక్కున ఆగి, "ఎవర్రా ఆయన?" అనడిగి "తంతాను కాబోలు" అని తమ్ముణ్ని విడిపించుకుని తుర్రుమంది. అలా పారిపోతూనే గోపాలాన్ని చురచురా చూసి మరీ మాయమైంది. అది చూపు కాదు మెరపు!

గోపాలానికి గొప్ప ఇరుకున పడ్డట్టయింది. అంతలో 'చిట్టి' వోడిపోయిన మొహంతో వచ్చి "రాదుట" అన్నాడు.

"రాదూ! మరేమంది?"

"తంతానంది!" చిట్టి మాటలకి శ్యామల పక్కున నవ్వేసింది. అంతలో గోపాలం మొహం చూసి, నోరు దొప్ప చేత్తో మూసుకుంది. గోపాలమూ నవ్వాలనీ, నవ్వులాంటిది నవ్వేశాడు.

తిరిగి శ్యామల బుగ్గన వేలుంచుకుని పరిశీలనగా చూసి, "ఎన్నో క్లాసు చదివేవూ?" అంది,

"పదిహేనో కళాసు" నవ్వుతూ ఈ పిల్ల బుగ్గ మీద చిటిక వేశాడు గోపాలం. పాలబుగ్గ కందిపోయింది.

చిట్టి శ్యామల గడ్డం పుచ్చుకుని, "పదవే అక్కా! పోదాము!" అంటూ మారాంలో పడ్డాడు.

"నే కొనిపెడతా బిస్కెట్స్ రాండి!" అంటూ గోపాలం గబుక్కున లేచి, చిట్టినెత్తుకుని, శ్యామలని నడిపించుకుని, బయల్దేరాడు పెళ్లి బాజాలకి దూరంగా బజార్లోకి.

'ఏమనుకుంది? చెప్పుమా ఆ పిల్ల?' అన్న సంకోచమే అతనికి పదే పదే కలిగింది.

ఆ ఆందోళనతోనే, జేబులో వున్న ఐదు రూపాయలతోనూ అడ్డమైనవీ, అడిగినవీ కొని, మేపి, బొమ్మలూ, ఓస్కత్తులూ చేతుల్లో వుంచి, విడిదికి చేరుకున్నాడు.

అప్పటికప్పుడే వడ్డనల కందుకుంది పెళ్లి. పెళ్లికొడుకు ఓ వార, చాప మీద యిష్టపరివారం మధ్య కూచుని, గోడకేసి తిరిగి దొంగతనంగా సిగరెట్ కాల్చుకుంటున్నాడు.

అంతవరకూ కుతూహలంగానే వచ్చిన ఆ పిల్ల, జ్యోతి, అక్కడ ఠక్కున ఆగి, "ఎవర్రా ఆయన?" అనడిగి "తంతాను కాబోలు" అని తమ్ముణ్ని విడిపించుకుని తుర్రుమంది. అలా పారిపోతూనే గోపాలాన్ని చురచురా చూసి మరీ మాయమైంది. అది చూపు కాదు మెరపు!

"రండి, రండి, మగపెళ్లివారందరూ! వడ్డనలైపోయాయి" కేకలు వినిపించినా, గోపాలం ఖాతరు చేయలేకపోయాడు.

తనెవరు? ఆ పిల్లలెవరు? యిదంతా, తనెందుకు చేసినట్లు? తప్పు చేసినట్లు ఫీలయ్యాడు.

పెళ్లి సందడంతా అతనికి ఆందోళనైపోయింది. తప్పిపోయిన పిల్లాడిలా మేనత్త కోసరం వెతుక్కుని, "అత్తా! అత్తా! నేనర్జెంటుగా వూరికి వెళ్లిపోవాలి గాని నువ్వు ఆనక రావూ?" అని బతిమాలుకున్నాడు.

"అయ్యో, అదేం అర్జంటురా యిప్పుడూ? నాగవల్లి అవనీ పోదామ్!" అని హడావుడిగా అత్తయ్య మందలించింది. కాని అతగాడి కాలు నిలవలేదు.

బస్సులోకి వచ్చి పడ్డాక, కాస్త తెప్పరిల్లింది ప్రాణం.

2

తనెందుకు హడలిపోయాడు? తనకే తెలియదు. తన కాలేజీ అంతా (ఒక్క మాటలో తెలుగులో చెప్పాలంటే, 'పడిచచ్చే' శారదకి ప్రేమలేఖ రాయ సాహసించిన తను, ఓ చిన్నపిల్ల చూపులకి హడలి పారిపోవడమే!)

బస్సు మరింత జోరుగా పరిగెత్తకూడదూ?

'అచ్చం పెళ్లికూతురిలా వుం'దనిపించింది! ఆ పిల్ల గురించి ఆలోచించకూడదు, అని అతగాడు చేసిన ప్రయత్నం సాఫల్యం, ఆ తలంపు? అత్తయ్య రాకుండా యింటికెడితే బామ్మ మొదలు, బావిలో నీళ్లు తోడుకునే పొరుగునున్న సుందరమ్మగారి దాకా అంతా పొడుచుకుతింటారని బస్సు దిగగానే బాబయ్యగారింటి కెళ్లలేదు గోపాలం.

సినీమా హాలుకేసి నడిచేడు.

సరిగ్గా టిక్కెట్టుకి చాలిన చిల్లర మిగిలింది. అరగంటైపోయిన సినిమాలో కూచుకున్నాడు.

మొదట జ్యోతి జ్ఞాపకం వచ్చింది. సినిమా అవుతూనే వుంది; కానీ జ్యోతి తలంపు... తర్వాత దాహమేసింది.

జేబులో నయా పైసాలు రెండే మిగిలేయి. మరి తంతే నయా పైసా లేదు. దాహం రెండితలయ్యింది.

విసుక్కుంటున్నాడు. "ఉదయం జ్యోతి విన్నది గనక మరచెంబుడు కాఫీ తెచ్చి పడేసింది. ఎంత అమాయకత్వం! ఇప్పుడు సోడా సోడా అనుకుంటే ఎవరిస్తారు? మరింత నాలిక ఎండిపోతుంది తప్ప!"

"ఎంత తీరుగా వుంటుంది? జ్యోతి ముక్కు!" అదే ముక్కూ, మొహం తెలీని చిన్నదాని తలంపు నించి పారిపోదామని, సినిమాలో తలదాచుకున్న గోపాలం బియ్యే నిగ్రహం.

జ్యోతి అతగాడి దాహం సంగతి వినలేదు. పైగా ఇంటర్‌వెల్‌లో సోడావాడు వుడికించేడు "సోడా! సోడా!" అని తన చుట్టూరా తిరిగి అమ్మి. అత్తయ్య తను సినీమా నుంచి తిరిగి వెళ్లేసరికి వచ్చేస్తుంది! అత్తయ్యకి అర్జంటైన అబద్ధం చెప్పాలి. ఆమె మంచిది. తన మాట వింటుంది. అయితే ఒక్క షరతు మీద ఇంటిల్లిపాదితో అత్తయ్య పెళ్లి ముచ్చట్లు చెబుతున్నప్పుడు తను అక్కడక్కడా అందించాలి. "భేషు!" అని, "అవునవునది అంతే!" నని అంటూ వుండాలి.



సినీమా తెర 'శుభం' చెప్పకుండానే ఇంటి మొహం పట్టేడు గోపాలం. తోవలో జ్యోతి తలంపు మళ్లీ నీడలా వెంటపడ్డది.

'వాళ్ల తమ్ముడికీ, వాళ్లకీ కొన్నవన్నీ చూసి జ్యోతి యేమనుకుంటుందీ? ఎంత చొరవ? ఎవరీ భడవ? అని నవ్వుకుంటుందా?'

'అయినా కాకపోయినా, తనకీ జ్యోతి సొద ఏమిటీ?' తను ఎం.ఏ. చదువుకుందికి వచ్చేడు. అవకాశమయితే శారద తీసుకున్న లిటరేచర్ తీసుకుని, ఆ అమ్మాయితో చెలిమి చేయాలని ఉవ్విళ్లూరుతున్నాడు కూడాను. శారదని "మిస్ కళాశా"లంటారు. గోపాలానికి వాళ్ల వూళ్లో క్లాసు మేటు. ఇప్పుడు కూడా అవుతుందని ఆశ. అంతే కాదు, తనకీ, శారదకీ కాలేజీలో వున్నంత కుర్రకారు యిక్కడ అడ్డం వుండదు. కనుక ఆ పిల్లతో స్నేహానికి కొన్ని ప్రణాళికలు సైతం వేసుకున్నాడు.

ఇలా ఆలోచనల బారి నుంచి తప్పించుకుందామని రోడ్డు వారంట నడిచేసరికి, బామ్మగారి గుమ్మం వచ్చేసింది. అనుకున్నట్లే, అత్తయ్యా ఎదురైంది.

అత్తయ్య చెబితే తప్ప తన పలాయనగాథ ఎవరికీ తెలీదని కుదుటపడ్డాడు.

3

ఉదయం లేచి నిబ్బరంగా వొళ్లు విరుచుకుంటూ వుంటే, మొదట కనిపించిన అత్తయ్య (మొహం మంచిదేనని గోపాలం ఆమెకి చెప్పడం అలవాటు) అదోలా నవ్వింది.

గోపాలానికి భయమేసి ఒక్క పరుగున, పెరట్లోకి వెళ్లాడు. అక్కడ నూతి దగ్గర, దండకసహితంగా స్నానం చేస్తున్న బామ్మ, తనకేసి చూసింది. తన బోసినోటితో అదోలా నవ్వింది. ఒక్క పళ్లు మినహాయిస్తే అత్తయ్య నవ్వుకీ, బామ్మ నవ్వుకీ పోలిక లున్నాయని పించింది గోపాలానికి.

బామ్మ, నూతిలో చేద దభేలున ముంచి, "హారినీ! ఎంతవాడివయ్యావురా?" అంది.

దాంతో గోపాలానికి దాహం వేసింది. బామ్మనే [illegible] బామ్మ ఆఖరి బాల్చీ నీళ్లు నెత్తిన గుమ్మరించుకోవడంతో [illegible] గొణుక్కున్నాడు. "వీళ్లంతా నా మీద కుట్ర పన్నుతున్నట్లే వుంది!"

అంతలో మావయ్య జపం ముగించుకుని, తులసి కోటలో నీళ్లు పోసి, దళం చెవినుంచుకుంటూ "అయితే గోపాలం! పెళ్లిపోట్లాలేమిటోయ్?" అన్నాడు.

గోపాలం "ఇహిహీ వుహావుహా ఏమున్నాయ్?" అంటూ పుడక నోట బెట్టుకుని నవుల్తూ నవ్వులాంటిది నవ్వేడు.

"సర్లే, డోంట్ వర్రీ! మీ అత్తయ్య నీ రసికత పసిగట్టేసింది. ఇంకేం పర్వాలేదు" అన్నాడాయన. పైగా తనేదో వరదలో పడి కొట్టుకొనిపోతూ వుంటే, పడవ తీసుకొచ్చి రక్షించినట్లు పోజు పెట్టేడు.

అది మరీ సంకటంగా తోచింది గోపాలానికి.

000

కాఫీ చప్పరిస్తూ గుమ్మం మీద కూచుని దిక్కులు చూడసాగేడు గోపాలం, ఎట్నుంచి ఏం పిడుగు ప్రశ్న పడుతుందోనని.

"అయితే గోపాలం...!" అనేసింది పిన్ని.

"సరే! రోట్లో బుర్రవుందిగా దంచు!'మన్నట్లు చూసేడు గోపాలం.

"నీకు కట్నం ఎంత కావాలోయ్?" అదీ పిన్ని ప్రశ్న.

"సరి, సరి! ఎద్దునడిగి కడ్తారా ఏం, గంతలు? వాడికేం తక్కువేం? ఎమ్మే చదువుతాడు. వాడు వద్దన్నా, మా అన్నయ్యా, వదినే మోమాటం పడ్డా నేను మాత్రం ఐదు వేలకి తగ్గను!" అత్తయ్య సమాధానం చెప్పేసింది.

"ఉహూఁ! అది సరే కట్నం దేనికి? కాఫీ కప్పులో మొహం దాచుకోవడం జరగని పని అని నిర్ణయించుకుని, నసిగేడు గోపాలం.

"అయితే మా వొదినని కట్నం లేకుండా తెస్తావన్నమాట!" బాబాయిగారి శశి కూడా రంగం మీదికి వచ్చేసింది.

దాన్ని మాట పూర్తి చెయ్యనివ్వలేదు. బామ్మ మడిగా గంజివారుస్తూనే. "అబ్బ! ఎంత నంగనాచివిరా? అక్కడేమో అంత రసగంధం నడిపితివి. పైగా పారిపోతివీ!" అన్నది.

"బాగానే వుంది! మీరంతా నన్నేదో ఆట పట్టిస్తున్నారల్లే వుంది!" బుకాయించబోయేడు గోపాలం.

"కాదురా బాబూ!" అత్తయ్య టాప్ గేర్లో పడిపోయింది. "నువ్వాడించిన ఆట ఆడదల్చుకున్నాం. ఇదంతా ఎందుకూ? పిల్ల సలక్షణంగా వుంది. నిన్ను మురిపించింది. పోతే అన్నయ్యా, వదినే మామాట కాదనరూ. ఇవాళే రాస్తా సవ్యంగా చెప్పు"మంది.

"అసలింతకీ జరిగిందేమిటీ?" గోపాలం ప్రశ్న పూర్తవకుండానే, అత్తయ్య బుగ్గలు పొడిచినంత పనిజేసింది.

"అవ్వ! ఎంత మాట! పేరూ వూరూ, చదువూ అన్నీ ఆరా తీసి, పిలిపించి దొంగతనంగా చూసి, అందుగ్గాను దాని తమ్ముమీ్ని,

చెల్లెల్నీ బుట్టలో వేసుకుని... ఎంతకేనా తగుదువురా!" అన్నది.

"ఇంతకీ వదినె పేరేమిట్రా అన్నయ్యా?"

"ఉండండర్రా! వాడిని మాటాడనివ్వండి. ప్రాణాలు కొరికేస్తారే ఏటి?" మావయ్య ఆపద్బాంధవుడి పోజులో వచ్చేడు.

"నేను యమ్మే అయితే గాని పెళ్లి చేసుకోను!" గోపాలం కోర్టులో సాక్షి ప్రమాణం చేసినట్లు చెప్పేడు.

"సరేలే! ఎమ్మే అవనా ఏమిటి నాన్నా? నీలాంటివాడికి మావ గారే నెత్తిన బెట్టుకుని చెప్పిస్తాడు చదువు!" పిన్ని తన పక్షం వహిం చినట్లు మాట్లాడింది.

"ఈ లోగా అబ్బాయిగారి కృష్ణలీలలు ఏ మరియమ్మనో సంపా యిస్తాయి!" వెటకారం చేసింది అత్తయ్య.

గోపాలానికి పారిపోదామన్నా కాళ్లు రాలేదు. పద్మవ్యూ హంలా నించున్నారందరూ!

"అది కాదత్తయ్యా!" అన్నాడు. అంతలో మావయ్య వచ్చి, "అది కాదురా గోపీ! నువ్విప్పుడు వద్దంటే, ఏ కాలేజీ అమ్మాయినో ప్రేమించేవన్నమాటకి దాఖలా అయిందంటుంది మా అత్తయ్య. నా మాట విను! మీ నాన్నకి ఇది ఆ సంగతి రాసి పడేసిందో, అగ్గిరుద్రుడైపో తాడు" అన్నాడు భుజం తట్టి.

'నిజమే, మా నాన్నంతటి కాల రుద్రుడే! ఎం.ఏ. గిమ్మే నై జాన్తా! తక్ష ణం తిరుగు జన్తాలో రమ్మంటాడు కూడాను!' అనుకున్నాడు గోపాలం. "అసలు నేను ప్రేమించందే!" నన్నాడు.

"మరెందుకురా? ఆ కొంటె వేషాలన్నీ వేసేవు?" అచ్చం క్రాసు పరీక్షలో లాయర్ మొహం పెట్టిందత్తయ్య.

"ఏవన్నీ?"

"ఇలా రా! చెబుతా" నంది.

గోపాలం పారిపోవడానికి సందు లేక అత్తయ్యని, వురిశిక్ష పడ్డాక తెగించిన ఖైదీలాగా వెంబడించేడు. అత్తయ్య గదిలో రాధాకృష్ణుల పటం ముందు కూచోబెట్టింది. "నిజం చెప్పరా!" అంది.

"ఏమిటి నిజం? నాకు ఎమ్మే అయ్యే దాకా పెళ్లి వద్దు" దబా యించేడు గోపాలం.

"పోనీ ఎమ్మే కావాలా?" అడిగింది అత్తయ్య.

"ఆం కావాలి! మా నాన్నగారామాత్రం చదువు చెప్పించగలర్లే. పెళ్లాడి కట్నంతో ఫీజు కట్టుకోనక్కర్లే" విదిలించాడు గోపాలం, అవ కాశం దొరికింది గదాని.

"ఓరినీ! తల్లి పుట్టిల్లు మేనమామ దగ్గరా అన్నట్లు, మా అన్నయ్య గొప్ప నాకే చెబుతావేం?" నవ్వింది అత్తయ్య. బుజ్జగిం పుగా "మరి నీకు సీటు కూడా అన్నయ్య యిప్పించగలడా?" అన డిగింది.

గోపాలానికి అత్తయ్య ధోరణి అర్థం అవలేదు. ఏదో వల పన్ను తున్నది. ఊరుకోవడం ఉత్తమం అనుకున్నాడు.

మళ్లీ అత్తయ్యే అడిగింది, "నీకే క్లాసు వచ్చిందిరా?"

"ఏదో ఒకటి. సెకండు క్లాసు. అదెందుకూ? క్లాసు చూసి కట్నం బేరమాడ్తావా?" కసిగా చూసేడు.

"మరి ఎమ్మే సీటు ఖాయంగా వస్తుందా?"

"రాపోతే పోనీ! నాకా పెళ్లొద్దు!"

అత్తయ్య బోలెడు జాలిపడి నవ్వేసింది. "ఎవర్ని ప్రేమించా వురా?" అంది.

'నిజమే. మా నాన్నంతటి కాలరుద్రుడే! ఎం.ఏ. గిమ్మే నై జాన్తా! తక్షణం తిరుగు జన్తాలో రమ్మంటాడు కూడాను!' అనుకున్నాడు గోపాలం. "అసలు నేను ప్రేమించందే!" నన్నాడు. "మరెందుకురా? ఆ కొంటె వేషాలన్నీ వేసేవు?" అచ్చం క్రాసు పరీక్షలో లాయర్ మొహం పెట్టిందత్తయ్య.

"వల్లకాట్లో రామనాథయ్యని!" గట్టిగా అరిచాడు.

"కాదు, నాకు తెలుసు! ఇవాళే రాస్తున్నా. ఆ అమ్మాయెవరో నీ క్లాసు మేటు" అత్తయ్య పూర్తి విజయగర్వంతో చూసింది.

"శుద్ధ అబద్ధం! ఆ సంగతి నాన్నకి తెలిస్తే నిజానిజాలు చూడడా యన!" ఆ భయంతోనే చతికిలబడ్డాడు గోపాలం.

"నా మాట విను! వీళ్ల నాన్న నీకు ఎమ్మేలో సీటు యిప్పించగ లడు. సిండికేటులో మాంచి పరపతి గలవాడు. పైగా ఆనక ఏ ఢిల్లీ లోనో ఉద్యోగం వేయిస్తాడు కూడాను" అత్తయ్య మరో కప్పు కాఫీ తెచ్చి ఇచ్చి, మరీ నచ్చచెప్పింది.

"అంత సమర్థులకి నేనే దొరకాలా? ఏమిటి? బోలెడుమంది దొరుకుతారు లెద్దూ!"

"అయితే, ఆ పిల్లకి నీవు తప్ప యింకోరు దొరకరనేనా? కలలో కూడా పలవరిస్తున్నావ్?" అత్తయ్య ప్రేమగా, జాలిగా అడిగింది.

గోపాలానికి నిజంగా భయమేసింది. అత్తయ్య అబద్ధం ఎందుకంటుంది? తనే కలలో పలవరించివుంటాడు.

"అసలా పిల్ల ఎవరో నాకు తెలియందే?" అన్నాడు కొంచెం తగ్గి.

"పోనీ. ఈ పిల్ల తెలుసుగా. దీని సంగతి చెప్పు? అచ్చం జ్యోతి గదా! హాయిగా ఉభయతా రకం... అదీ గాక వదినెకి వీళ్లు దగ్గర కూడానూ. పైగా... చెటితినిగా, ఎమ్మేలో నీకు కావలసిన ఎక్నామిక్సు వస్తుంది. మీ మావయ్య కూడా చెప్పేరు."

అంతలో శశి అక్కడికి వచ్చేసింది.

"పనున్నట్లు ఏవిటే ఆ తొందరా?" అన్నది అత్తయ్య.

"నాన్నగారొచ్చేరు. అన్నయ్యకి మొదటి లిస్టులో సీటు రాలే దుట" రొప్పుతూ చెప్పింది, అదేదో శుభవార్తలాగా.

"మరేం బెంగ లేదు. వాడికి సీటు రిజర్వయ్యింది. నువ్వెళ్లి మీ మావయ్యని పిలవ"మంది అత్తయ్య.

గోపాలం మైనపుబొమ్మలా అలా కూచున్నాడు. జ్యోతీ, మర చెంబూ జ్ఞాపకం వచ్చేయి. అంత విచారంలోనూ చిన్న దరహాసం పొడసూపింది.

"నాన్నగారేమంటారో?" అన్నాడు.

"ఏమంటారు? మా వాడూ ప్రయోజకుడయ్యాడంటారు. నే చెబుతాగా... నువ్వుండు" అంటూ అత్తయ్య, తబ్బిబ్బయినంత సంరంభంతో అవతలికి వెళ్లింది.

గోపాలం లేచి పచార్లు చేద్దామనుకుని లేవలేకపోయాడు.

అంతలో శశి రివ్వున వచ్చి, "అన్నయ్య పెళ్లికొడుకాయెనే!" అంది, అమాంతం గోపాలం భుజాలు వూపి.

"పోఫో! నోరు ముయ్యి! సీటు రాక నేనేడుస్తూవుంటే..." అన్నాడు గోపాలం.

"వదినే యిస్తుందిలే స్వీటు! కాని నేనో శుభవార్త చెబుతా. మరి నాకేమిస్తావ్" శశి మురిపించింది.

"అత్తయ్యకి రికమండ్ చేస్తా, వరుణ్ని వెదకమని" కొంటెగా నవ్వేడు, శశి చెవి పట్టుకుని.

"ఛీ! నాకొద్దు కాని, మాంచి రిబ్బను పట్రా!"

"ఓకే! శుభవార్త చెప్పు!"

"మరేం వొదినె పేరు ఉత్త జ్యోతికాదు. పరంజ్యోతి!" అని పారి పోయింది శశి.

●